క్లుప్తంగా

వద్దిపాడులో పారిశుధ్య పనులు



చిల్లచెట్లు తొలగిస్తున్న జేసీబీ

దొనకొండ: మండలంలోని వద్దిపాడులో వర్షాలకు వీధుల్లో నీరు నిలిచి పోవటం, రోడ్డు వెంట చిల్ల చెట్లు పెరగటంతో రహదారి అధ్వానంగా తయారైంది. సర్పంచ్ నూనె సరోజా వెంకటరెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది పూడికతీత, చిల్ల చెట్లు తొలగించటం, నీరు నిల్వ ఉన్న చోట కాలువలు తీయటం వంటి పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన వరి సాగు



వరి నారును పరిశీలిస్తున్న ఏఓ

దొనకొండ: ఈ ఏడాది మండలంలో వరి సాగుపై రైతులు దృష్టి సారించారు. సాగర్ కాలవ సకాలంలో రావడంతో రైతులు వరి పంట వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 600 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 250 ఎకరాలు మాత్రమే రైతులు సాగు చేశారు. సాగర్ కాలవకు సమీపంలో ఉన్న గ్రామాలైన లక్ష్మీపురం, చందవరం, దేశిరెడ్డిపల్లి, రామాపురం, పోలేపల్లి గ్రామాల్లో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం సాగర్ కాలవ రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి కోసిన తర్వాత పొలాల్లో రెండో పంట కింద మినుము సాగు చేస్తామని రైతులు చెప్తున్నారు.

దొనకొండలో జోరు వర్షం



దొనకొండలో పడుతున్న వర్షం

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విపరీతంగా వర్షం దంచింది. ఒక పక్క ఎండ కాయటం, మరొక పక్క వర్షం పడటం వారం రోజుల నుంచి పరిపాటిగా మారింది. రైతులు సాగు చేసిన పొలాలకు క్రిమి సంహారిక మందులు పిచికారీ చేయకుండా వర్షం అనుకోకుండా కురుస్తోంది. దీంతో గ్రామంలోని రైతులు విసుగు చెందుతున్నారు. ప్రజలు పొలాలకు రాకుండా వర్షానికి ఇంట్లోనే ఉంటున్నారు. గొర్రెలు, మేకలు, పశువులు పొలాలకు మేతకు వెళ్లేడానికి ఇబ్బందికరంగా ఉందని పశు పోషకులు చర్చించుకుంటున్నారు.

నోటుపుస్తకాల పంపిణీ



నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న గురుప్రసాద్, అంజిరెడ్డి

దర్శి: విద్యార్థులకు దాతల సహకారంతో నోటుపుస్తకాల పంపిణీ కార్యక్రమం కట్టశింగన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సోము అంజిరెడ్డి ఆర్థిక సహకారంతో 150 నోటు పుస్తకాలను హెచ్ఎం జి.గురుప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కట్టశింగన్నపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు వేణు, సయ్యద్ సుభానీ, సీహెచ్ హైమావతి పాల్గొన్నారు.

మహిళల్లో అక్షరాస్యతను పెంచడమే ఉల్లాస్



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు

దర్శి: మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఉల్లాస్ పథకానికి శ్రీకారం చుట్టినట్లు వెలుగు ఏపీఎం హనుమంతరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వీఓఏలు, వయోజన విద్య శాఖ అధికారులతో సోమవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్వయం సహాయక సంఘాల్లో మహిళలందర్నీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే పథకం ప్రధాన ఉద్దేశమని, నవంబర్ 5 నుంచి శిక్షణా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి రోజు సాయంత్రం 5-7 గంటల వరకు తరగతులు ఉంటాయని, సూపర్‌వైజరు రవీంద్రనాథరెడ్డి వివరించారు. సీసీలు కోటేశ్వరరావు, దాసు, విలేజ్ ఆర్గనైజర్లు సమావేశంలో పాల్గొన్నారు

రోడ్లా? పిల్ల కాలువలా?



పిల్ల కాలువలా మారిన పేరంబొట్లపాలెం రోడ్డు



గొల్లపాలెం ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

- తటాకాలను తలపిస్తున్న గ్రామీణ రోడ్లు
- పాఠశాలల ముందూ ఇదే దుస్థితి
- పట్టించుకోని పాలకులు



పడమరకాశీపురం నుంచి వెల్లంపల్లి వెళ్లే రోడ్డు దుస్థితి

కురిచేడు: పది రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రస్తుతం గ్రామీణ రోడ్లన్నీ పిల్ల కాలువలను తలపిస్తున్నాయి. కాలు తీసి కాలు పెట్టలేని దుస్థితి నెలకొంది. మండల కేంద్రం నుంచి గొల్లపాలెం, కాటంవారిపల్లె, పేరంబొట్లపాలెం వెళ్లే దారి పిల్ల కాలువలా తయారైంది. గొల్లపాలెం, ఎస్ఎస్‌పీ అగ్రహారం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ముందు రోడ్డుపై నీరు నిలబడి తటాకాలుగా మారాయి. పడమరకాశీపురం నుంచి వెల్లంపల్లి వెళ్లే దారి గుంతలమయమై కంపచెట్లతో నిండిపోయింది. ఆ రోడ్డులో నడిచేందుకు వీల్లేని పరిస్థితి ఏర్పడింది. ఏ చిన్న అవసరమొచ్చినా మండల కేంద్రానికి రావాల్సిన పరిస్థితి ఉంది. ఆటోలు తిరగడం లేదు, కనీసం నడిచి వద్దామన్నా ఎక్కడ జారిపడి అవయవాలు విరగ్గొట్టు కోవాల్సి వస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, నాయకులకు భజన చేసేందుకే వారి సమయం మొత్తం సరిపోతుంది. ఇక ప్రజా సమస్యలపై దృష్టి పెట్టే తీరిక లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రోజు రోజుకూ ప్రజా సమస్యలు పెరిగిపోతున్నా పాలకులు, అధికారులు వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో నీటి నిల్వలు పెరిగితే వ్యాధులు ప్రబలి ప్రజలు మంచం పట్టే ప్రమాదం పొంచి ఉదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎస్ఎస్‌పీ అగ్రహారంలో ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం



దర్శి: అమరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

దర్శి: పోలీసుల అమరవీరుల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీ డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. దర్శి పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్సైలు, సీఐలు రామారావు, హసన్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. పొదిలి, టీవీ పల్లి, కేకేమిట్ల, త్రిపురాంతకం, ముండ్లమూరు, తాళ్లూరు, దొనకొండ, కురిచేడు ఎస్సైలు, తహసీల్దార్ శ్రావణ్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సభ్యులు, ఎన్జీఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోలీసుల పాత్రపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు కె.శ్రావణి ప్రథమ, కె.సరస్వతి ద్వితీయ, వై.నేతాన్ తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. విజేతలకు కళాశాల అడ్మిన్ నానీ, ప్రిన్సిపాల్ రామయోగి బహుమతులు అందజేశారు. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



యర్రగొండపాలెంలో ర్యాలీ చేస్తున్న పోలీసులు

యర్రగొండపాలెం: పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జరగనున్న వారోత్సవాలను సోమవారం సీఐ ప్రభాకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సర్కిల్ పరిధిలోని పోలీసులతో పాటు పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల త్యాగాలను జ్ఞాపకం చేసుకొని వారికి నివాళులర్పించారు. యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దదోర్నాల ఎస్సైలు చౌడయ్య, సంపత్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలి

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండే విధంగా ఉపాధ్యాయులు చూడాలని ఎంఈవోలు శామ్యూల్‌జాన్, ఇందిర అన్నారు. సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో టాయిలెట్ క్లీనర్స్‌ను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు మరుగుదోడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. లేకుంటే దుర్వాసన వచ్చి విద్యార్థులు వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని చెప్పారు.



ఉపాధ్యాయులకు టాయ్లెట్ కీట్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈవోలు

పోషకాహారంపై అవగాహన



మునగాకుపై అవగాహన కలిగిస్తున్న ఫాతిమా

కురిచేడు: స్థానిక నుసుం బజారులోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు సోమవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఎంతో పోషక విలువలు కలిగిన మునగాకు గురించి అంగన్‌వాడీ కార్యకర్త ఫాతిమా వివరించారు. ఖర్చు లేకుండా ఎక్కువ పోషకాలు లభించే ఆకు కూరల్లో మునగాకు ఎంతోమేలైనదని తెలిపారు. మూడు వేల రోగాలను తగ్గించే సంజీవనిలా మునగాకు పనిచేస్తుందని ఆమె తెలిపారు. మునగాకును ఏ విధంగా ఉపయోగించాలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు వంటలు చేసి చూపించారు.

పిడుగుపడి గేదె మృతి

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి తోడు పిడుగు పడటంతో గ్రామానికి చెందిన దుగ్గెంపూడి సుబ్బారెడ్డికి చెందిన గేదె మృతి చెందింది. మృతి చెందిన గెదె విలువ 80 వేల రూపాయల చేస్తుందని రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చనిపోయిన గెదెను చూసి చలించిపోయారు.

అపార్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

పుల్లలచెరువు: పాఠశాలల్లో ప్రస్తుతం జరగుతున్న అపార్ ప్రక్రియను సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో ఇందిర ఆదేశించారు. సోమవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న అపార్ ప్రక్రియను తనిఖీ చేశారు. కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్, వన్ స్టూడెంట్ నినాదంతో అందుబాటులోకి తీసుకొచ్చిన అపార్ ఎన్నో ప్రయోజనాలను అందిస్తోంది. ప్రత్యేకంగా రూపొందించిన 12 అంకెల గుర్తింపు వ్యవస్థనే అపార్‌గా చెబుతున్నారు. వివరాలన్నీ కార్డులోనే భద్రపరచనున్నారు. దీంతో స్థానికంగానే కాకుండా దేశ, విదేశాల్లో విద్యనభ్యసించడం ఇక నుంచి సులభతరం కానుంది. ఈ విధానంలో విద్యార్థుల సంపూర్ణ విద్య ప్రగతి వారి తల్లిదండ్రులకు తెలిసే అవకాశం ఏర్పడుతుంది.



అపార్ సేవల ప్రక్రియను తనిఖీ చేస్తున్న ఎంఈవో ఇందిర

ఎంఈవో ఇందిర మాట్లాడుతూ తొలి విడతగా 9,10 తరగతులకు అపార్ ఐడీని రూపొందించే పనిని ప్రారంభించారని, మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినట్లుగా ఆమె తెలిపారు.

డప్పు కళాకారుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా కిశోర్

పెద్దదోర్నాల: మాదిగ చర్మ డప్పు కళాకారుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా మండలానికి చెందిన పందీటి కిశోర్‌బాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సోమవారం మండల కేంద్రంలోని శివ సదనం అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇండియా ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నల్లూరి నాగయ్య పాల్గొని నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దోర్నాల మండల అధ్యక్షుడిగా పందీటి కిశోర్‌బాబు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా బండారు శ్యామ్ మాదిగను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బరిగెల ప్రసాదరావు, కటికల రాజారత్నం, యలకపాటి ఆశీర్వాదం, కటికల శ్రీను, ఒంగేరపు వెంగళరావు, పందీటి అశోక్ కుమార్, జిన్నా పాల్గొన్నారు.



చర్మ డప్పు కళాకారుల నూతన కమిటీ

ఏమారితే ఏమవునో?



చాపలమడుగు వద్ద రోడ్డు దుస్థితి ఇలా..

పుల్లలచెరువు: వారం రోజులుగా రోజూ మండలంలోని పలు గ్రామాల్లో వర్షం పడుతూనే ఉంది. పుల్లలచెరువు-యర్రగొండపాలెం రహదారి మధ్య చాపలమడుగు వద్ద, పుల్లలచెరువు నుంచి వినుకొండ వెళ్లే రహదారిలో ముటుకుల, తెల్లగట్ల వద్ద రహదారిపై లోతైన గుంతలు ఏర్పడి రాకపోకలకు ప్రజలు భయపడుతున్నారు. వర్షం పడి నీరు చేరి గోతులు పెద్దవయ్యాయి. ఈ రహదారుల్లో ప్రయాణం చేయాలంటే ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

తర్లుపాడు: మండలంలో సాగు చేస్తున్న ఉద్యాన పంటల్లో రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మార్కాపురం ఉద్యానశాఖాధికారి రమేష్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని తాడివారిపల్లి, నాగేళ్లముడిపి, చెన్నారెడ్డిపల్లి, తర్లుపాడు గ్రామాల్లో రైతులు సాగు చేసిన బొప్పాయి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు ఊరకెత్తిన పొలాల్లో లీటరు నీటికి పది గ్రాముల యూరియా, 10 గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు రోజులు పిచికారీ చేయాలని, మొక్కలు తలలు వాల్చితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఇనుపధాతు లోపంతో మొక్కలు వాలినట్లు కనపడితే లీటరు నీటికి 50 గ్రాముల అన్నబేధి, ఒక్క నిమ్మచెక్క రసం కలిపి పిచికారీ చేయాలన్నారు. వేరుకుళ్లు ఆశించిన పొలాల్లో కాప్రాక్స్ క్లోరైడ్ 30 గ్రాములు, కార్బన్డిజం పది గ్రాములు పదిలీటర్ల నీటిలో కలిపి ద్రావణన్ని మొక్కల మొదట్లో పోయాలన్నారు. గొంగళిపురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేదా అసఫేట్ 1.25 గ్రాములు పిచికారీ చేయాలని తెలిపారు. కొత్తగా బొప్పాయి మొక్కలు నాటేప్పుడు నీరు నిల్వకుండా చూసుకోవాలని తెలిపారు. ఒక వేళ మొక్కలు పసుపు రంగులోకి మారడం, కాండం కుళ్లు వంటి లక్షణాలు ఉంటే రెడోనిల్ 2 గ్రాములు, ఎలైట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు దగ్గరగా మట్టిని పోయాలన్నారు.



మిర్చిపంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి రమేష్

రెజ్లింగ్ పోటీల్లో గొట్లగట్టు విద్యార్థుల ప్రతిభ

కొనకనమిట్ల: ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లా జట్టులో పాల్గొన్న మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సోమవారం పాఠశాలలో హెచ్ఎం విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల పీడీ బాలగురవయ్య మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు వి.విష్ణువర్ధన్‌రెడ్డి, వరప్రసాద్, ఉమాశంకర్, దుర్గాప్రసాద్, వెంకటయ్య, నవీన్, యువరాజు, పి.విష్ణువర్ధన్‌రెడ్డిలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు. వారిలో విష్ణవర్ధన్‌రెడ్డి బంగారు పతకం సాధించగా వరప్రసాద్ బ్రాంజ్ మెడల్ సాధించారని చెప్పారు. విష్ణవర్ధన్ రెడ్డి వచ్చేనెల 16వ తేదీ నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్పూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని స్పష్టం చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు విద్యార్థులు ఎంపిక కావటానికి మంచి తర్ఫీదు ఇచ్చిన పాఠశాల పీడీ బాలగురవయ్యను, ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా తమ పాఠశాల క్రీడాకారులు విజయం సాధించాలని ఆకాంక్షించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

నిబంధనల ప్రకారం పనులు చేయించాలి

బేస్తవారిపేట: ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిబంధనల ప్రకారం పనులు చేయించాలని ఎంపీడీఓ రంగనాయకులు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో సోమవారం నూతనంగా నియమితులైన ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో పని కోరిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సూచించారు. పనులకు హాజరైన వారికి మాత్రమే హాజరు వేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ డాక్టర్ భాస్కర్‌రావు, ఏపీఓ గురువర కుమార్, టీఏలు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పుల్లలచెరువు: ఆధార్ కార్డుల్లో ఏవైనా మార్పులు, చేర్పులు చేసుకోవాలంటే మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఆధార్ సేవల ఏర్పాటు కేంద్రాలు 22వ తేదీన మురికమళ్ల, గండిబావిగూడెం, 23వ తేదీన మురికిమళ్ల, ఐటీ వరం-2 సచివాలయం, 24వ తేదీన గారపెంట, మానేపల్లి, 25వ తేదీన గారపెంట, అక్కపాలెం గూడేల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘం పరిధిలో ఈ నెల 22 నుంచి 25 వరకూ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నారాయణరావు సోమవారం తెలిపారు. ఈ నెల 22 నుంచి 23 వరకూ పూలసుబ్బయ్య కాలనీలోని ఎంపీయూపీ స్కూల్లో, 24 నుంచి 25 వరకూ బాపూజీ కాలనీలోని మున్సిపల్ సెంట్రల్ స్కూల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంటు, బయోమెట్రిక్ అప్‌డేషన్, డెమోగ్రఫిక్ అప్డేట్లను ఉచితంగా నిర్వహిస్తారని, బయోమెట్రిక్ అప్‌డేట్ 100 రూపాయలు, డెమోగ్రాఫిక్ అప్డేట్లకు 50 రూపాయలు, డౌన్‌లోడ్ అండ్ కలర్ ప్రింట్ 30 రూపాయలకు అందిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

కొనకనమిట్ల: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఏపీడీ జేకే నిర్మలాదేవి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామాల్లో గ్రామ సభల్లో తెయజేసిన పనులను గుర్తించి ఆ మేరకు పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, రిసోర్స్ పర్సన్ అనిల్‌కుమార్, ఏపీఓ బుల్లెన్నరావ్, క్లస్టర్ సూపర్‌వైజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నవోదయలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు పీఎం శ్రీజవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11 తరగతుల్లో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు అక్టోబరు 30 చివరి తేదీ అని, విద్యార్థులు నమోదు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు httpr://navodaya.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పిచ్చిమొక్కల తొలగింపు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండ మీద లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే రహదారిలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో భక్తుల రాకపోకలు ఇబ్బందికరంగా ఉందని ఆదివారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి నగర పంచాయతీ అధికారులు స్పందించారు. రాజానగర్ నుంచి నరసింహస్వామి ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డులో పిచ్చిమొక్కలు పెద్దగా పెరిగిపోవడం వల్ల రహదారి కనిపించకుండా పూడుకుపోయిందని గుర్తించి పిచ్చి మొక్కలను తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో ఆలయానికి రాకపోకలు సుగమం అయ్యాయని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.